క్లుప్తంగా

కనులవిందుగా వేణుగోపాలుడి కల్యాణం



నెమలి(గంపలగూడెం): గంపలగూడెం మండలం నెమలి వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామి మాసకల్యాణం శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు తిరునగరి గోపాలచార్యులు, అర్చక బృందం సత్యభామ, రుక్మిణీదేవి సమేత వేణుగోపాల స్వామి కల్యాణ శాస్త్రోక్తంగా జరిపారు. నలుగురు దంపతులు పీఠలపై కూర్చొని కన్యాదానం చేశారు. ఆలయ సహాయ కమిషనర్ దాసరి శ్రీరామ వర ప్రసాదరావు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

తిరువూరు: క్యాన్సర్ గుర్తింపునకు తిరువూరు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తిరువూరు కల్యాణి నర్సింగ్‌హోం ఆవరణలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు అసోసియేషన్ చైర్మన్ తాళ్లూరి రామ కోటేశ్వరరావు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి జరిగే క్యాంపులో మహిళలు వైద్యపరీక్షలు చేయించుకోవాలని పేర్కొన్నారు.

నూజివీడు ఏఎంసీ సెక్రటరీగా శ్రీనివాసరావు



నూజివీడు: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) సెక్రటరీగా ఎం. శ్రీనివాసరావు నియమితులయ్యారు. గ్రేడ్–3 సెక్రటరీగా పనిచేస్తున్న ఆయనకు పూర్తి అదనపు బాధ్యతలు కల్పిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేశారు. ఇప్పటివరకు ఇక్కడ సెక్రటరీగా పనిచేసిన మహాలక్ష్మిని ఏలూరు వ్యవసాయ మార్కెట్ కమిటీకి బదిలీ చేశారు. బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో ఏఎంసీ ఆదాయం రూ.3 కోట్లు లక్ష్యం కాగా, ఇప్పటి వరకు రూ.80 లక్షలు మాత్రమే వసూలైందని తెలిపారు. రాబోయే ఐదు నెలల్లో లక్ష్య సాధనకు కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు.

పోలీసుల తనిఖీలు

తిరువూరు: తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సరిహద్దుల్లో ఉన్న తిరువూరు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పోలీసులు శనివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. పాత నేరస్తుల కదలికలను గమనించడంతో పాటు, అక్రమ నగదు, మద్యం నిల్వలను గుర్తించడానికి ఈ తనిఖీలు చేశారు. పట్టణంలోని తంగెళ్లబీడు, రాజుపేట ప్రాంతాల్లో జరిగిన తనిఖీల్లో ఏసీపీ రమేష్, తిరువూరు సీఐ నబీ అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారించారు.

విశిష్టమైనది తెలుగుభాష



తిరువూరు: ప్రపంచంలోని అన్ని భాషలకంటే తెలుగు భాష విభిన్నమైందని, మాతృభాషపై పట్టు సాధించే విద్యార్థులకు అపార ఉపాధి అవకాశాలుంటాయని జంగారెడ్డిగూడెం ప్రభుత్వ కళాశాల తెలుగు అధ్యాపకులు వెంకట్‌లాల్ అన్నారు. వాల్మీకి జయంతి సందర్భంగా తిరువూరు ప్రభుత్వ డిగ్రీకళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో శనివారం 'అమ్మ భాషలో ఉపాధి అవకాశాలు' అనే అంశంపై సెమినార్ జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన వెంకట్‌లాల్ తెలుగుభాష విశిష్టతను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ సుశీలరావు, వైస్ ప్రిన్సిపాల్ అబూబకర్, తెలుగు విభాగాధిపతి విజయానందరాజు పాల్గొన్నారు.

కల్యాణ మండపం నిర్మాణానికి రూ.50 వేల విరాళం



పెనుగొలను(గంపలగూడెం): గంపలగూడెం మండలం పెనుగొలను శివారు మెట్టగుట్ట శేషాచల శ్రీనివాసస్వామి ఆలయ ప్రాంగణంలో కల్యాణ మండప నిర్మాణానికి ఒక భక్తుడు శనివారం రూ. 50వేలు వితరణగా ఇచ్చారు. మండలంలోని చల్లగుండ్లవారిపాలేనికి చెందిన బొల్లారెడ్డి నాగిరెడ్డి, అంజలి దంపతులు విరాళాన్ని ఆలయ కమిటీ చైర్మన్ జొన్నల ప్రతాప రెడ్డికి అందజేశారు. అర్చకులు దాత దంపతులను ఆశీర్వదించి ప్రసాదం అందజేశారు.

వరి పొలాల పరిశీలన

ఇబ్రహీంపట్నం: గరికపాడు కృషి విజ్ఞాన కేంద్రం, గన్నవరం ఐసీసీ కేంద్రం, విజయవాడ జిల్లా వనరుల కేంద్రానికి చెందిన పలువురు వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం మండలంలోని ఈలప్రోలు, కాచవరం గ్రామాల్లో వరి పంటను శనివారం పరిశీలించారు. కాచవరంలో సూరయ్య అనే రైతు ఎంటీయూ 1662 రకం విత్తనం నాటి 90 రోజులు దాటినప్పటికీ పొట్ట దశకు రాకపోవడంతో ఆయన పొలాన్ని పరిశీలించారు. ఎక్కువ మోతాదులో ఎరువు, నీటి వినియోగం, కిరణజన్య సంయోగ క్రియ తక్కువ జరగడంతో పొట్టదశకు చేరడం ఆలస్యం అవుతుందని రైతుకు ధైర్యం చెప్పారు. పంటలో సుడిదోమ నివారణకు చేపట్టాల్సిన ఎరువుల యాజమాన్యం తెలిపారు. శాస్త్రవేత్తలు కృష్ణంరాజు, శివప్రసాద్, రా జశేఖర్, ఏడీ మాధవీలత, మనీషా, ఏఓ శైలజ పాల్గొన్నారు.

'ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలి' విజయవంతం చేయండి

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

ముసునూరు: ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు పిలుపునిచ్చారు. ముసునూరులోని రేగుల బ్రదర్స్ ప్రాంగణంలో జెడ్పీటీసీ, సచివాలయాల కన్వీనర్ డా.వరికూటి ప్రతాప్ ఆధ్వర్యంలో మండల పార్టీ అధ్యక్షుడు ఎం.నాగవల్లేశ్వరరావు అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమంపై అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. ముందుగా ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కొర్లగుంట ఎంపీటీసీ వన్నెకూటి సుందరరావుకు రెండు నిమిషాల మౌనం పాటించి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ప్రతి ఇంటికీ వెళ్లి జగనన్న ప్రభుత్వంలో వారికి చేకూరిన లబ్ధిని గణాంకాలతో సహా వివరించాలన్నారు. ఏ ముఖ్యమంత్రి అమలు చేయనన్ని పథకాలను జగనన్న ప్రవేశపెట్టి, ప్రతి వారిని ఆదుకున్నారన్నారు. అందుకే జగనన్నను మళ్లీ, మళ్లీ ముఖ్యమంత్రిని చేసి, పథకాలు కొనసాగేలా ప్రజలంతా అండగా ఉండి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో స్టేట్ హిస్టరీ అకాడమీ డైరెక్టర్ పి.స్వరూపరాణి, తాత్కాలిక ఎంపీపీ రాజానాయన, వైస్ ఎంపీపీ గంగాధర్, ఎంపీటీసీ సభ్యురాలు కె.దుర్గాభవాని, నాయకుడు ఆర్ సుబ్బారావు, సర్పంచ్‌లు కె.వాణి, ఎన్.సత్యనారాయణ, దామోదర్, పి.సత్యనారాయణ, పి.కృష్ణ పాల్గొన్నారు.

జగన్ మళ్లీ సీఎం కావడం ఖాయం

చాట్రాయి: రాజకీయాలకతీతంగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి మళ్లీ సీఎం కావడం ఖాయమని నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు స్పష్టం చేశారు. మండలంలోని బూరుగుగూడెం గ్రామంలో వైఎస్సార్ సీపీ గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లకు శనివారం నిర్వహించిన ఆంధ్రాకి జగనే ఎందుకు కావాలనే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు రాక్షస పాలన చేయడంతో జైలు పాలయ్యాడని ఆయన విమర్శించారు. టీడీపీ ప్రభుత్వంలో ప్రజలను పట్టించుకోలేదని, నాయకులు, ఎమ్మెల్యేలు, మంత్రులు మాత్రమే లబ్ధి పొందారన్నారు. వలంటీర్లు, గృహసారథులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న కార్యక్రమాలను వివరించాలని ఆయన తెలిపారు. ఏపీ కో–ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, సర్పంచ్ దేశిరెడ్డి హైమావతి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మిద్దె బాలకృష్ణ, మండల సచివాలయాల కన్వీనర్ సుబ్బారెడ్డి, నాయకులు బాబ్జీ, ప్రసాదుబాబు, వాసు, చెన్నారావు, నరసింహారావు పాల్గొన్నారు.



బూరుగుగూడెంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు

జైలు జీవితం ఖైదీల జీవితాల్లో మార్పు తీసుకురావాలి

రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి హరిబాబు

నూజివీడు: క్షణికావేశంలో చేసిన తప్పుల వల్ల జైలు జీవితం గడపాల్సి వస్తోందని, జైలు జీవితం అనేది ఖైదీల జీవితాల్లో మార్పు తీసుకురావాలని రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కే హరిబాబు అన్నారు. పట్టణంలోని సబ్‌జైల్‌ను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రిమాండ్ ఖైదీలనుద్దేశించి మాట్లాడుతూ క్షణికావేశంలో చేసిన తప్పులు, అక్రమ మార్గంలో డబ్బును సంపాదించాలనే ఆలోచనతోనే ఎక్కువ మంది నేరాలకు పాల్పడి జైలుకు వస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి వ్యక్తీ తమ కుటుంబాన్ని పోషించుకుంటూ కుటుంబ సభ్యులకు ఆదర్శంగా ఉండాలన్నారు. పిల్లల భవిష్యత్ కోసం కష్టపడి పనిచేసుకోవాలన్నారు. అనంతరం ఖైదీలకు తయారు చేస్తున్న ఆహారాన్ని, కల్పిస్తున్న సౌకర్యాలను, గదులను, ఆవరణలో పరిశుభ్రతను జడ్జి పరిశీలించారు. ఎవరైనా పేదరికంతో న్యాయవాదిని నియమించుకునే స్థోమత లేకపోతే మండల న్యాయసేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సాయాన్ని పొందవచ్చని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని రిమాండ్ ఖైదీలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జైలు సూపరింటెండెంట్ జీ ప్రసాద్ పాల్గొన్నారు.



ఖైదీలనుద్దేశించి మాట్లాడుతున్న రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి హరిబాబు

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి



వాల్మీకి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు విజయభాస్కరరెడ్డి

రెడ్డిగూడెం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం వాల్మీకి మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు విజయభాస్కరరెడ్డి వాల్మీకి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విష్ణు ప్రసాద్, మాజీ ఎంపీపీ కాంతారావు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పెనుగొలనులో వాల్మీకి మహర్షి గ్రామోత్సవం

పెనుగొలనులో..

పెనుగొలను(గంపలగూడెం): గంపలగూడెం మండలం పెనుగొలనులో శనివారం షిరిడీ సాయిబాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి జయంతి ఘనంగా నిర్వహించారు. వాల్మీకి చిత్ర పటాన్ని పల్లకిలో ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. విశ్రాంత ఎంఈఓ వి.శేషిరెడ్డి, వాల్మీకి సంఘ నాయకులు పి.బ్రహ్మం, ఎం.కృష్ణ పాల్గొన్నారు.

ఈ–క్రాప్ జాబితాను సరిచూసుకోండి

గంపలగూడెం: మండలంలోని వివిధ గ్రామాల్లో 2023 ఖరీఫ్‌సీజన్లో పలు రకాల పైర్లు, సాగు చేసిన రైతులు ఈనెల 30వ తేదీలోపు ఈ–క్రాప్ బుకింగ్, కేవైసీ పూర్తి చేసుకోవాలని వ్యవసాయాధికారి సాయిశ్రీ తెలిపారు. మండలంలో ఇప్పటి వరకు 8,596 మంది రైతులకు సంబంధించిన సాగైన 24,806 ఎకరాల్లో పైర్లను ఈ–క్రాప్, కేవైసీ పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ఈ క్రాప్, కేవైసీ పూర్తి చేసుకున్న రైతులకు మాత్రమే ప్రభుత్వం అందజేసే సబ్సిడీ నష్టపరిహారం పంట కొనుగోలు తదితర సౌకర్యాలు అందుతాయని తెలిపారు.

ఈ–క్రాప్ నమోదుపై గ్రామ సభలు

రెడ్డిగూడెం: ఈ–క్రాప్ బుకింగ్ లిస్టుపై మండలంలోని కూనపరాజుపర్వ, నరుకుళ్లపాడులో శనివారం గ్రామ సభలు నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి సురేష్ మాట్లాడుతూ రైతులు ఈ–క్రాప్ లిస్టు పరిశీలించుకుని అభ్యంతరాలు ఉన్నట్లయితే ఆయా రైతు భరోసా కేంద్రాల్లో అర్జీ పెట్టుకోవాలని తెలిపారు. ఈ నెల 30వ తేదీ లోపు అభ్యంతరాలుంటే అర్జీలు పెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటేశ్వరరావు, ఉప సర్పంచ్ రవిబాబు, మాజీ సర్పంచ్ బాబురావు పాల్గొన్నారు.

విత్తనాల తయారీలో మెలకువలు పాటించాలి

గోసవీడు(గంపలగూడెం): తగిన మెలకువలు పాటించడం ద్వారా రైతులు నాణ్యమైన విత్తనాలను తయారు చేసుకోవాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి బి. సత్యవతి తెలిపారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్లో వరి సీడెడ్ విలేజ్‌గా ఎంపికైన గంపలగూడెం మండలం గోసవీడులో శనివారం రైతులకు విత్తన తయారీపై ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. తయారీలో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులను, కేళీల ఏరువేత విధానాన్ని వివరించారు. ప్రస్తుతం నెలకొన్న బెట్ట పరిస్థితుల్లో వరి పైరును కాపాడుకునేందుకు యూరియా ద్రావణాన్ని పిచికారీ చేసుకోవాలని సూచించారు. వ్యవసాయాధికారి బి.సాయిశ్రీ, సర్పంచ్ కే ప్రశాంత్ పాల్గొన్నారు.



గోసవీడులో విత్తనాల తయారీపై శిక్షణ ఇస్తున్న సత్యవతి

ప్రజల ఆరోగ్య సంరక్షణే ప్రభుత్వ ధ్యేయం

నూజివీడు: ప్రజల ఆరోగ్య సంరక్షణే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని, ఇందులో భాగంగానే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా గ్రామగ్రామాన వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ ఆరేపల్లి శిరీష అన్నారు. మండలంలోని సిద్ధార్థనగర్‌లోని ఎంపీయూపీ స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని శనివారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల్లోని పేద, మధ్య తరగతి ప్రజల ఆరోగ్య పరిరక్షణకు వైద్యశిబిరాలు దోహదపడుతున్నాయన్నారు. ఈ శిబిరంలో 326 మందికి వైద్య పరీక్షలు చేసి మందుల కిట్లను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బాణావతు చిలకమ్మ, ఎంపీడీఓ వీపీ విజయ్‌కుమార్, వైఎస్సార్ సీపీ నాయకుడు రామిశెట్టి కృష్ణ పాల్గొన్నారు.



మందుల కిట్లను అందజేస్తున్న ఎంపీపీ ఆరేపల్లి శిరీష

యూటీఎఫ్ మైలవరం శాఖ అధ్యక్షుడిగా తిరుపతిరావు



మైలవరం: యూటీఎఫ్ మైలవరం శాఖ అధ్యక్షుడిగా ఎం.తిరుపతిరావు, మండల ప్రధాన కార్యదర్శిగా వసంతరావు వాడపల్లి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మైలవరం సీపీఎం కార్యాలయంలో యూటీఎఫ్ మైలవరం మండల శాఖ ఎన్నికలు శనివారం జరిగాయి. కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా ఎన్టీఆర్ జిల్లా యూటీఎఫ్ శాఖ ప్రధాన కార్యదర్శి ఏ సుందరయ్య, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు ఎస్.ముత్తయ్య, జిల్లా కార్యదర్శులు రత్నకమల్, కే గంగరాజు పాల్గొన్నారు.

భూసర్వేపై అవగాహన సమావేశాలు

తిరువూరురూరల్: మండలంలో జరుగుతున్న భూముల రీసర్వేపై రైతులకు అవగాహన కల్పించేందుకు పలు సచివాలయాల్లో శనివారం సమావేశాలు నిర్వహించారు. వామకుంట్ల, కొమ్మిరెడ్డిపల్లి గ్రామాల్లో రైతులకు రీసర్వే జరిగే విధానాన్ని సచివాలయ సిబ్బంది తెలియజేశారు. రిజిస్టర్డు దస్తావేజుల్లోని కొలతల ప్రకారమే సర్వే జరుగుతుందని, రైతుల భూములకు గతంలో నెలకొన్న సరిహద్దు సమస్యలు సర్వేతో పరిష్కారమవుతాయని అధికారులు వివరించారు.

ఇంకుడు గుంటల నిర్మాణానికి స్థల పరిశీలన



తిరువూరురూరల్: మండలంలోని పలు గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా ఇంకుడుగుంటల నిర్మాణానికి శనివారం అధికారులు స్థల పరిశీలన చేశారు. మల్లేల, అక్కపాలెం, మునుకుళ్ల, ఎరుకోపాడు గ్రామాల్లోని పంచాయతీ స్థలాల్లో వీటిని నిర్మించేందుకు సచివాలయ, పంచాయతీ అధికారులు ప్రతిపాదించారు. భూగర్భజలాల పెంపుతో పాటు నీటిపొదుపు చర్యల్లో భాగంగా ఇంకుడు గుంటలను నిర్మించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగేశ్వరరావు తెలిపారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

ఆగిరిపల్లి: మండలంలోని ఈదరలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఆగిరిపల్లి ఎస్సై నంబూరు చంటిబాబు శుక్రవారం అర్ధరాత్రి తన సిబ్బందితో దాడిచేసి 11 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. రూ.12,410 నగదు, 14 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

శోభనాచలస్వామి ఆలయం మూసివేత

ఆగిరిపల్లి: చంద్రగ్రహణం సందర్భంగా ఆగిరిపల్లిలో వేంచేసియున్న శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనరసింహ స్వామి ఆలయాన్ని శనివారం సాయంత్రం ఆరు గంటలకు మూసివేశారు. అర్ధరాత్రి దాటిన తరువాత పాక్షిక చంద్రగ్రహణం ఉన్నందున ఆదివారం తెల్లవారుజామున ఐదు గంటలకు ఆలయ ద్వారాలు తెరిచి సంప్రోక్షణ చేసి పూజ అనంతరం ఉదయం ఏడు గంటల తరువాత భక్తులకు దర్శనం కల్పిస్తారని ఆలయ ప్రధాన అర్చకులు వేదాంతం శేషుబాబు తెలిపారు.



ఆగిరిపల్లిలో శోభనాచలస్వామి ఆలయాన్ని మూసివేసిన అర్చకులు

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

ఎమ్మెల్యే రక్షణనిధి

విస్సన్నపేట: ప్రజాసమస్యలు పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణ నిధి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం మీటింగ్ హాల్లో మండలస్థాయి అధికారులతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ఎమ్మెల్యే సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. మండలంలోని తెల్లదేవరపల్లి, పుట్రేల పంచాయతీ పరిధిలో కొంత మంది రైతుల భూములు చుక్కల భూములుగా ఉన్నాయని, వాటిని చుక్కల భూముల నుంచి తొలగించాలని తహసీల్దార్ చంద్రశేఖర్‌కు ఎమ్మెల్యే సూచించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో అర్హులైన వారు నివేశన స్థలాలు కోరారని వారి లిస్టు పరిశీలించి అర్హులకు నివేశ స్థలాలు కేటాయించాలన్నారు. మండలంలో పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాల్సి ఉందని, ఆ పనులు త్వరితగతిన చేపట్టాలని విద్యుతుశాఖ ఏడీ నారాయణకు ఎమ్మెల్యే సూచించారు. నిర్మాణంలో ఉన్న సీసీ రహదారులు, సచివాలయ భవనాలు త్వరితగతిన పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని పీఆర్ ఏఈ దేవసహాయంతో ఎమ్మెల్యే అన్నారు. గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న పంటలకు సంబంధించి వివరాలు సక్రమంగా నమోదు చేయాలని, ఎరువులు, విత్తనాలు రైతుభరోసా కేంద్రాలవద్దే కొనుగోలు చేసేలా చూడాలని ఏఓ రాజ్యలక్ష్మి సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్ వెంకటరమణ, తహసీల్దార్ చంద్రశేఖర్, జెడ్పీటీసీ సభ్యుడు లోకేశ్వరరెడ్డి, ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి, సర్పంచ్ నాగమల్లేశ్వరి, మాజీ వైస్ ఎంపీపీ ఓలేటి దుర్గారావు, కేడీసీసీబీ డైరెక్టర్ భూక్యా రాణి, వైఎస్సార్ సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ శివబాజీ, పట్టణ అధ్యక్షుడు కుటుంబరావు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

వైఎస్సార్ బీమా నగదు అందజేత

విస్సన్నపేట: మండలంలోని నరసాపురం గ్రామానికి చెందిన సాలి వెంకటేశ్వరరావు రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ ఆగస్టు 17వ తేదీన మృతి చెందాడు. దీంతో వైఎస్సార్ బీమా కింద మృతుడి భార్య సత్యవతికి రూ.5 లక్షలు బీమా నగదు మంజూరైంది. ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణ నిధి చేతుల మీదుగా శనివారం నగదు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్.వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు లోకేశ్వరరెడ్డి, ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి పాల్గొన్నారు.



వైఎస్సార్ బీమా నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

మానసిక ఉల్లాసాన్ని పెంపొందించేవి క్రీడలు

మైలవరం: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని జేఎన్‌టీయూకే ఐసీటీ సెక్రటరీ డాక్టర్ జీపీ రాజు తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో జేఎన్‌టీయూకే సెంట్రల్ జోన్ బాస్కెట్ బాల్(మెన్, విమెన్) ఇంటర్ కాలేజియేట్ టోర్నమెంట్ 2023–24 శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాలకు చెందిన ఇంజినీరింగ్ కళాశాలల నుంచి 216 మంది విద్యార్థులు టోర్నమెంట్‌కు వచ్చిరని పేర్కొన్నారు. బాలురకు సంబంధించి–13, బాలికలకు సంబంధించి–5 టీములు పోటీలో పాల్గొన్నాయి. ఇంటర్ కాలేజియేట్ టోర్నమెంట్ తమ కళాశాలలో నిర్వహించడం ఆనందంగా ఉందని ఎల్‌బీఆర్‌సీఈ ప్రెసిడెంట్ జీ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఎస్‌వీ రాజుకుమార్ మాట్లాడుతూ విజేతలకు ఆదివారం ప్రదానం ఉంటుందని పేర్కొన్నారు.



బాస్కెట్ బాల్ పోటీలో తలబడుతున్న జట్లు

పామాయిల్ సాగుతో స్థిరమైన ఆదాయం

మైలవరం: పామాయిల్ సాగుతో దీర్ఘ కాలం స్థిరమైన ఆదాయం పొందవచ్చని వైఎస్సార్ సీపీ రైతు విభాగం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ గంగాధరరావు తెలిపారు. మైలవరం మండలం చంద్రాల గ్రామ సచివాలయంలో ఉద్యాన శాఖ, పతంజలి ఫుడ్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఆయిల్ ఫామ్ సాగుపై రైతులకు అవగాహన సదస్సును శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గంగాధరరావు మాట్లాడుతూ రైతులు పామాయిల్ సాగుపై అవగాహన కలిగి ఉండి సాగుకు ముందుకు రావాలన్నారు. పతంజలి ఫుడ్స్ డీజీఎం వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ కంపెనీ ఆధ్వర్యంలో నాగులూరు గ్రామంలో నాణ్యమైన పామ్ ఆయిల్ మొక్కలను పెంచి రైతులకు సరఫరా చేయుటకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఔత్సాహిక రైతులు రైతు భరోసా కేంద్రంలో దరఖాస్తు చేసుకుని మొక్కలు తీసుకోవచ్చని పేర్కొన్నారు. జాతీయ నూనె గింజల మిషన్ పథకంలో ప్రభుత్వం అందిస్తున్న ఆయిల్‌పామ్ రాయితీ వివరాలను ఇన్‌చార్జి ఉద్యాన అధికారి సోహైల్ అహ్మద్ రైతులకు వివరించారు. కార్యక్రమంలో నూజివీడు ఏరియా మేనేజర్ హరికృష్ణ, ఫీల్డ్ ఆఫీసర్ రాంబాబు, ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ, వీఏఏ నాగరాజు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో పాల్గొన్న గంగాధరరావు, వీరేంద్ర చౌదరి

ఉరుసు మహోత్సవం ప్రారంభం

ఏ.కొండూరు: మండలంలోని చీమలపాడు గ్రామంలో బాబే బాగ్దాద్ ఆస్థాన అతాయే తాజ్ ఖాదరియా దర్బార్లో శనివారం నుంచి మహనీయులు సూఫీ మహమ్మద్ అతావుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరి బాబా వారి ఉరుసు మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా దర్బార్ పీఠాధిపతి మహమ్మద్ ఖాజా మొహియుద్దీన్, విజయనగరం దర్బార్ పీఠాధిపతి మహమ్మద్ ఖలీల్‌బాబు మహోత్సవాన్ని ప్రారంభించారు. మేళ తాళాలతో పకీర్ల డప్పు వాయిద్యాలతో జెండా గంధ మహోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం బాబా దివ్య సమాధి వద్ద చాదర్, పూలు, గంధం సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బాబా భక్తులు వేలాది మంది పాల్గొని బాబా ప్రసాదాన్ని స్వీకరించి బాబా వారి దివ్య సమాధిని దర్శించుకున్నారు. వేలాది మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మహమ్మద్ జాఫర్ షరీఫ్, తాజ్ ఖాదర్‌బాబు పాల్గొన్నారు.



బాబా దివ్య సమాధి వద్దకు ప్రార్థనలు చేసేందుకు వెళుతున్న పీఠాధిపతి కాజా మొహిద్దిన్

దోమల నివారణకు చర్యలు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపాల్టీ పరిధిలోని 28వ వార్డులో దోమల నివారణకు చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. ఇటీవల వాతావరణ మార్పులతో దోమలు పెరిగినట్లు ప్రజల నుంచి వినతులు రావడంతో ఎబేట్ మందును నీటిలో కలిపి వీధుల్లోని డ్రెయినేజీలు, ఖాళీ ప్రదేశాల్లోని గడ్డిమొక్కలపై దోమల మందు పిచికారీ చేశామని పేర్కొన్నారు. పారిశుద్ధ్యం నిర్వహణకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.